క్లుప్తంగా

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక రేపు

కురుపాం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయ ఆవరణలో విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదికను శుక్రవారం నిర్వహించనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ పార్వతీపురం ఈఈ వీవీ కిశోర్ బుధవారం తెలిపారు. ఫోరం చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ అధ్యక్షతన జరగనున్న ఈ పరిష్కార వేదికలో పార్వతీపురం ఐటీడీఏ సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు పాల్గొని తమ సమస్యలను తెలియజేయవచ్చని పేర్కొన్నారు. సూచనలు, సలహాలు కూడా అందించవచ్చని తెలిపారు.

తాగునీటి బోరు ఏర్పాటు



బీసీ కాలనీలో బోరు ఏర్పాటు

పాలకొండ రూరల్: మండలంలోని తంపటాపల్లి గ్రామ బీసీ కాలనీలో తాగునీటి బోరు ఏర్పాటు బుధవారం చేపట్టారు. జెడ్పీటీసీ పాలవలస గౌరీపార్వతి సహకారంతో సమకూరిన రూ.2లక్షల నిధులతో ఈ పనులు ప్రారంభించారు. దీర్ఘకాలంగా వేధిస్తున్న నీటి సమస్యకు ఈ పనుల ద్వారా పరిష్కారం లభించిందని వైఎస్సార్ సీపీ నాయకులు సీహెచ్.జగదీష్‌కుమార్, అల్లు సురేష్‌కుమార్, వెంకటరమణ, దిలీప్ తదితరులు పేర్కొన్నారు.

రహదారి భద్రత నియమాలు పాటించాలి

వీరఘట్టం: సురక్షిత ప్రయాణాలు చేయాలంటే ప్రతీ డ్రైవర్ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఎస్ఐ ఎంవీ రమణ సూచించారు. వీరఘట్టం కొత్త బస్టాండ్ సెంటర్‌లో ఆటో డ్రైవర్లకు బుధవారం అవగాహన కల్పించారు. వీరఘట్టం, నడుకూరు, విక్రమపురం, నడిమికెల్ల గ్రామాల్లో రోడ్డు పక్కనే పాఠశాలలు ఉన్నందున ఆయా ప్రాంతాల్లో వాహనదారులు పరిమిత వేగంతో ప్రయాణాలు చేయాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

పాలకొండ: తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతికి బుధవారం వినతి పత్రం అందజేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకుల ఎస్.హిమప్రభ, బి.అమరవేణి ఆధ్వర్యంలో తమ డిమాండ్‌లు వివరించారు. ఈ సందర్భంగా తెలంగాణ మాదిరిగా వేతనాలు అందించాలని, సుప్రీం కోర్టు గ్రాట్యూటీ చెల్లించాలని, పింఛన్ అందించాలని కోరారు. సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని విన్నవించారు.

పకడ్బందీగా ఓటరు సర్వే



మాట్లాడుతున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: ఓటరు సర్వే పకడ్బందీగా చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనా కుమారి అన్నారు. స్థానిక ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులతో పీఓ బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటరు సర్వే త్వరితగతిన చేపట్టాలన్నారు. ఓటర్ల జాబితాలో తప్పులు, మరణించిన వారి పేర్లు తొలగించడం, పోలింగ్ బూత్‌లను సరి చేయడం, వేరే రాష్ట్రాలకు చెందిన వారి ఓట్లు తొలగించడం వంటివి చేసేటప్పుడు నిబంధనల ప్రకారం చేస్తామన్నారు. వివిధ రాజకీయ పార్టీలు చెప్పిన అంశాలను పరిశీలిస్తామన్నారు. కొత్త పంచాయతీలకు పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు అంశాన్ని పరిశీలిస్తామన్నారు. బోగస్ ఓట్లు తొలగించడం జరుగుతుందన్నారు. ఒకే ఇంటి నంబర్‌పై ఎక్కువ ఓట్లు ఉన్న అంశాన్ని పరిశీలన చేసి వాటిని కూడా తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో నాలుగు మండలాల తహసీల్దార్లు, డీటీలు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

వీరఘట్టం: మండల వ్యాప్తంగా గురువారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో డీఈఈ గోపాలకృష్ణమూర్తి బుధవారం తెలిపారు. నవగాం, వీరఘట్టం సబ్‌స్టేషన్లతో పాటు పాలకొండ నుండి వీరఘట్టం వచ్చే ప్రధాన విద్యుత్ లైనులో మెయింటెనెన్స్ పనులు చేపట్టనున్నందున విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రాష్ట్రంలో సంక్షేమ పాలన

- ఎమ్మెల్యే కళావతి
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యేకు జనం నీరాజనం



పొల్లలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమం, అభివృద్ధి దిశగా పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మునుపెన్నడూ లేని విధంగా ప్రతీ ఇంటికి ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి చేకూర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. మండలంలోని పొల్ల గ్రామ సచివాలయ పరిధిలో మత్రిమానుగూడ, చాపరాయిగూడ, వెలగాపురం, నాయకమ్మగూడ, ఉమ్మగెడ్డ, కొత్తవలస తదితర గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. తమ గ్రామాలకు ఎమ్మెల్యే రావడంతో మహిళలు అడుగడుగునా హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. నాయకులు, అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను ప్రచారం చేస్తూ ప్రజలు పొందిన లబ్ధిని వివరించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా? ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అంటూ పలకరిస్తూ ముందుకు సాగారు. గిరిజన ప్రాంతాల్లో అందరికీ సంక్షేమ పథకాలు పార్టీలకతీతంగా అందుతున్నాయన్నారు. అర్హత ఉంటే ఎలాంటి సిఫార్సు లేకుండా దరఖాస్తు చేసుకుంటే నిర్ణీత గడువులోగా పథకాలు వర్తింపజేయాలని అధికారులకు సూచించారు. గడప గడపకు మన ప్రభుత్వం పూర్తయిన గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనకు ప్రభుత్వం రూ.40లక్షలు ఏజెన్సీ ప్రాంతాల్లో మంజూరు చేస్తుందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాలకు మౌలిక వసతులు కల్పనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. నాడు – నేడు ద్వారా ప్రభుత్వ బడులకు అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. మీ పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలకు తప్పనిసరిగా పంపించాలన్నారు. ఇంజినీరింగ్ వంటి చదువులు పూర్తి చేసిన వారికి స్కిల్ కళాశాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వైద్య సౌకర్యాలు మెరుగుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, వైస్ ఎంపీపీ కుండంగి సరస్వతి, ఏఎంసీ చైర్మెన్ మోహన్‌రావు, పార్టీ నాయకులు ఎం.రామారావు, ఎస్.రాము, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సర్పంచ్ ఉప ఎన్నికకు సర్వం సిద్ధం

- గుమ్మ సర్పంచ్ బరిలో నలుగురు అభ్యర్థులు
- 19న ఎన్నిక

కురుపాం: మండలంలోని గుమ్మ గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి ఉప ఎన్నికకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈ నెల 19న ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరగనుంది. గుమ్మ పంచాయతీ పరిధిలోని పురుష ఓటర్లు – 571 మంది, మహిళా ఓటర్లు 631 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఓటు వేసేందుకు రెండు గదులను అధికారులు ఏర్పాటు చేసారు. సర్పంచ్ బరిలో నలుగురు అభ్యర్థులు ఉండగా అదే రోజు ఓట్ల లెక్కింపు చేసి ఫలితం ప్రకటించనున్నారు.

పోటా పోటీగా ప్రచారం

బరిలో ఉన్న అభ్యర్థులు నలుగురు పోటా పోటీగా ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. పంచాయతీ పరిధిలో 8 గ్రామాలు ఉండగా ఆయా గిరిజన గ్రామాలకు వెళ్లి తమ ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఇప్పటికే గుర్తులు కూడా అభ్యర్థులకు కేటాయించటంతో కరపత్రాలతో ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం ప్రారంభం



ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రంలో రైతులకు కూరగాయల విత్తనాలు అందజేస్తున్న డీపీఎం

కొమరాడ: మండలంలోని నిమ్మలపాడు గ్రామంలో నేల తల్లి ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రబంధకులు పి.షన్ముఖరాజు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులకు కూరగాయల విత్తనాలు అందజేశారు. సర్పంచ్ గుండ్రెడ్డి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీపీఎం మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన పంటలకు అవసరమైన ఉత్పాదకాలు, సేంద్రీయ ఎరువులు, జీవామృతాలు, రంగు పల్లాలు, నవధాన్యాలు మరియు కషాయాలు, ద్రావణాలు రైతులకు అందుబాటులో లభ్యమవుతాయన్నారు. ప్రతీ రైతు తప్పనిసరిగా వనరుల కేంద్రాన్ని సద్వినియోగించుకుని, తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించి, ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను పండించుకోవాలని అన్నారు. సీఎస్ఎఫ్ కార్యకర్తలకు రైతులకు అనునిత్యం అందుబాటులో ఉండి తగు సూచనలు, సలహాలను అందివ్వాలని కోరారు. కార్యక్రమంలో మార్కెటింగ్ మాస్టర్ ట్రైనీలు జి.నిర్మలాదేవి, నరసింహా, మండల ఇన్‌చార్జ్ ఎస్.ప్రసాద్, ఎల్ వన్, ఎల్ త్రీలు, రైతులు, వీఓఏ, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కేవీకే ఆధ్వర్యంలో శిక్షణ



శిక్షణ ఇస్తున్న కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ఉమాజ్యోతి

గుమ్మలక్ష్మీపురం: అరటి పండుతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై మండ గ్రామానికి చెందిన గర్భిణులు, బాలింతలకు రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం (ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం)కు చెందిన గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ఉమాజ్యోతి బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మైదా పిండిని వంటకాల్లో విసర్జించాలని, తరచూ విరివిగా లభ్యమయ్యే అరటి పండుతో చిన్న పిల్లలకు తినిపించగలిగిన అనుబంధ ఆహారాన్ని తయారు చేసుకోవచ్చన్నారు. అరటి పండుతో తయారు చేసిన విలువ ఆధారిత ఉత్పత్తులలో పొటాషియం మరియు పీచు పదార్థాలు అధికంగా ఉంటాయని, వాటిని ఆహారంగా స్వీకరించడం వలన ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

ఊరటనిచ్చిన వర్షం

పాలకొండ: కొద్ది రోజులుగా వర్షం లేకపోవడంతో సాగునీటి కోసం అవస్థలు పడుతున్న రైతులకు ఊరట కలిగింది. బుధవారం సాయంత్రం గంటపాటు వర్షం కురిసింది. దీంతో ఇప్పటికే నాట్లు వేసిన పొలాల్లో నీరు చేరింది. అరకొరగా మిగిలిన దమ్ములు పూర్తి చేసుకునేందుకు అవకాశం కలిగింది. మరో వైపు నాగావళి ఎడమ కాలువ ద్వారా సాగునీరు విడుదల కావడంతో పాటు శివారు ప్రాంతాలకు చేరింది.

పేదలకు వస్త్రదానం

భామిని: మండలంలోని పెద్దదిమిలిలో రిటైర్డ్ హెచ్ఎం ఎద్దు గోపాలదాస్‌నాయుడు ఆధ్వర్యంలో పేదలు, వృద్ధులకు వస్త్రదానం బుధవారం చేశారు. సర్పంచ్ తొగరాన శ్రీను, వెల్ఫేర్ అసిస్టెంట్ రాజేష్ పట్నాయక్ సహకారంతో పేదలకు అందజేశారు.

విశ్వబ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి

గరుగుబిల్లి: విశ్వబ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని ఉమారామలింగేశ్వర విశ్వబ్రాహ్మణ సంఘం మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు బుక్కూరు బ్రహ్మాజీ, చింతాడ తవిటాచార్యులు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం సంఘం సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలో విశ్వబ్రాహ్మణ సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు, సమస్యల పరిష్కారానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు అంపిలి శ్రీను, అజ్జరాపు కాశీవిశ్వనాథం, బి.తిరుపతి రావు, బి. వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పెదబుడ్డిడిలో వైద్య శిబిరం

జియ్యమ్మవలస: మండలంలోని పెదబుడ్డిడిలో ఉచిత ఆరోగ్య శిబిరం బుధవారం నిర్వహించారు. గ్రామాలలో అపరిశుభ్రత వల్లే డెంగీ వ్యాధి విస్తరిస్తుందని రావివలస పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కార్తీక్ అన్నారు. పెదబుడ్డిడి గ్రామంలో డెంగీ వ్యాధి చాపకింద నీరులా వ్యాప్తి చెందుతుందని ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. డెంగీ వ్యాధిపై అవగాహన కొరకు గ్రామంలో దండోరా వేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ సీమల సుజాత, మాజీ ఎంపీటీసీ బాబూ భువనమోహనరావు, గ్రామ పెద్దలు, రోగులు పాల్గొన్నారు.

సక్రమంగా స్టోన్ ప్లాంటేషన్

భామిని: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు – శాశ్వత భూసర్వేలో జరుగుతున్న స్టోన్ ప్లాంటేషన్ సక్రమంగా వేగవంతంగా చేయాలని డివిజన్ భూ సర్వే అధికారులు కమలేశ్వర్, ప్రేమ్‌కుమార్ అన్నారు. మండలంలో జరుగుతున్న భూసర్వేలో సరిహద్దులు నిర్ధారించే కొలత రాళ్లు వేసే విధానాన్ని బుధవారం వారు పరిశీలించారు. రైతుల భూమిని నిర్ధారించి స్టోన్ ప్లాంటేషన్ చేయాలన్నారు. వేసిన సరిహద్దు రాళ్లపై కొలతలు పరిశీలించారు. రాళ్లు పాతే కూలీలకు సూచనలు చేశారు. వీఆర్ఓ వినోద్‌కుమార్, వీఆర్ఏ మిన్నారావు ఉన్నారు.

రైతు సేవలో ముందుకు..



వీరఘట్టం పీఏసీఎస్ కార్యాలయం

- పాడి పశువుల రుణాలకు పెద్దపీట
- ధాన్యం కొనుగోళ్లకు చొరవ
- ప్రగతి పథంలో వీరఘట్టం వ్యవసాయ సహకార పరపతి సంఘం

వీరఘట్టం: రైతు సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఆశయాలను నెరవేర్చేందుకు వీరఘట్టం సహకార సంఘం అడుగులేస్తోంది. కేవలం పంట రుణాలకే పరిమితం కాకుండా రైతులకు విరివిగా రుణాలు అందజేస్తూ దూసుకెళ్తోంది. ధాన్యం కొనుగోలు, పాడి పశువుల కొనుగోలుకు విస్తారంగా రుణాలు అందిస్తోంది. ఇలా రైతులకు అండగా నిలుస్తోంది. ఏడాదిగా అనేక కార్యక్రమాల ద్వారా సహకారం ముందు వరుసలో నిలుస్తోంది. రైతులకు అడిగిన వెంటనే రుణాలు అందజేస్తోంది. ముస్ముందు ఎసైన్‌మెంట్ పట్టాదారులకు రుణాలు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటోంది. గత రెండు సీజన్లలో రూ.7.63 కోట్లు మేర ధాన్యం వ్యాపారం చేసింది.

వీరఘట్టం సహకార సంఘంలో లావాదేవీల వివరాలు

రుణ వివరాలు	రైతుల సంఖ్య	రుణాలు
మూల ధనం	4,637	రూ.18.64 కోట్లు
స్వల్పకాలిక రుణాలు	2,785	రూ.18.01 కోట్లు
దీర్ఘకాలిక రుణాలు	85	రూ.99.82 లక్షలు
పాడి రుణాలు	105	రూ.49.42 లక్షలు
ఇతర రుణాలు	26	రూ.77.22 లక్షలు
ధాన్యం వ్యాపారం	495	రూ.7.63 కోట్లు

పాడి అదనపు ఆదాయం

పంటలు సాగు చేస్తూ పాడి పశువులున్న 105 మంది రైతులను గుర్తించి వారికి రూ.1లక్ష నుంచి రూ.3 లక్షల మేర రూ.49.42 లక్షల రుణాలు అందించింది. దీనికి ఎలాంటి తనఖా లేకున్నా రుణాలు అందించడం విశేషం. రైతులు పాడి పశువులను పెంచుకోవడం ద్వారా అదనపు ఆదాయం సమకూరుతోంది. ప్రభుత్వం నుంచి వచ్చే వడ్డీ రాయితీ విషయంలో చొరవ తీసుకుంటోంది. ఇలా వీరఘట్టం వ్యవసాయ సహకార పరపతి సంఘం రైతులకు అండగా నిలుస్తోంది.

495 మంది రైతుల నుంచి 50 వేల క్వింటాళ్ల ధాన్యం సేకరించింది. రైతులకు వారి ఖాతాల్లో నగదు జమ చేయడంలో చురుగ్గా వ్యవహరించింది. రైతులకు పట్టాదారు పుస్తకాలు కలిగిన వారికి ఎకరానికి దీర్ఘకాలిక రుణాలు కింద రూ.లక్ష నుంచి రూ.3లక్షల మేర రుణాలు అందిస్తోంది. దీనికి వడ్డీ కూడా స్వల్పంగా పడుతుంది. దీంతో రైతులకు ప్రైవేటు అప్పుల నుంచి విముక్తి కలిగింది. ఇక్కడ 216 మంది రైతులకు గతేడాది రూ.18 కోట్ల మేర దీర్ఘకాలిక రుణాలు అందజేసింది.

ఏడాదిలోపు రూ.3 కోట్ల రుణాలిచ్చాం



వీరఘట్టం సహకార సంఘం ద్వారా రైతులకు ఈ ఏడాది ఖరీఫ్‌లో పంటల పెట్టుబడి, పాడి రైతులకు దీర్ఘకాలిక, స్వల్పకాలిక పద్ధతిలో రూ.18 కోట్ల రుణాలు అందజేసాం. ధాన్యం కొనుగోలును పారదర్శకంగా చేపడుతూ గతేడాది రూ.7.63 కోట్ల వ్యాపారం చేసాం. ఇలా అన్ని రకాలుగా రైతు సేవలో ముందుకు సాగుతున్నాం. – కర్రి గోవిందరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు, వీరఘట్టం

రైతుకు గరిష్ట మద్దతు ధర



రైతులకు ప్రతీ ఏటా ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ట మద్దతు ధర కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఆర్‌బీకే కేంద్రాలతో సమన్వయంతో పని చేసి ధాన్యం కొనుగోలు చేపడుతున్నాం.
– బూరాడ పైడిరాజు, సీఈఓ, పీఏసీఎస్, వీరఘట్టం

విద్యతోనే ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ

గుమ్మలక్ష్మీపురం: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమని ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సీఐ పాల్గొని మాట్లాడారు.

డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు ఒక నిర్దిష్టమైన లక్ష్యాన్ని ఏర్పరుచుకొని ఆ లక్ష్యానికి అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రస్తుత సాంకేతిక యుగంలో ఉపాధి పొందేందుకు ఎన్నో మార్గాలున్నాయని, ఆ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ప్రిన్సి పాల్ శ్రీవరం, వైస్ ప్రిన్సిపాల్ డి.రామయ్య, వైశ్య సంఘం అధ్యక్షుడు జి.హరిప్రసాద్, ఎస్ఐ ఎస్.షన్ముఖరావు, పలువురు అధ్యాపకులు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా విద్యా ర్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఎన్ఎస్ఎస్ పీఓలు పెదరామకృష్ణ, త్రినాథ్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అగ్ని ప్రమాదాల నుంచి బాధితులను రక్షించే విధానాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పాలకొండ రూరల్: అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ముందుగా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని పాలకొండ అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు అన్నారు. మండలంలోని అట్టలి సెయింట్ డొమినిక్ పాఠశాలలో బుధవారం ఈ తరహా ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ప్రమాదాలు చోటుచేసుకునే తరుణంలో శాఖ పరంగా తీసుకునే రక్షణ చర్యలపై విద్యార్థులకు డెమో నిర్వహించి అవగాహన కల్పించారు. ముఖ్యంగా బహుళ అంతస్తుల్లో, ఇరుకైన వీధుల్లో, గదుల్లో, అగ్నితో పాటు పొగ దట్టంగా పేరుకుపోయినటప్పుడు, తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ప్రమాదంలో చిక్కుకున్న వారిని రక్షించే సమయంతో వారి ప్రాణాలు కాపాడేందుకు అనుసరించాల్సిన జాగ్రత్తలపై తర్ఫీదు ఇచ్చారు.

ఆధునిక సాంకేతికతతో సత్ఫలితాలు



దురుబిలిలో వ్యవసాయ క్షేత్రాలు పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

గుమ్మలక్ష్మీపురం: రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం (ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం) ద్వారా అందించే సాంకేతికతను జిల్లాలోని రైతులు అందిపుచ్చుకొని పంటలలో అధిక దిగుబడులు సాధించాలని ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ టీఎస్ఎస్‌కే పాత్రో అన్నారు. ప్రోగ్రాం కో ఆర్డినేటర్ సూచనల మేరకు కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.స్రవంతి, డాక్టర్ జి.అమృత వీణ, డాక్టర్ ఎం.అనంత విహారి కురుపాం, జియ్యమ్మవలస మండలాల్లోని దురుబిలి, చింతలబెలగాం, గిజబ గ్రామాల్లో సాగులో ఉన్న వరి రకాల ఎంటీయు 1224, ఆర్‌జీఎల్ 2537 పంటల క్షేత్రాలను బుధవారం పరిశీలించారు. ఉభాలు చేపట్టనున్న రైతులతో మాట్లాడారు. ప్రతీ రెండు మీటర్ల నాట్లకు 20 సెంటీమీటర్ల కాలిబాటలు వదలాలంటూ రైతులకు సూచనలు చేశారు. ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు.

నేత్ర శస్త్రచికిత్సలకు పలువురి ఎంపిక



సీహెచ్‌సీ నుండి కంటి రోగులను శస్త్ర చికిత్సలకు తరలిస్తున్న వైద్య సిబ్బంది

కురుపాం: వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా కురుపాం – గుమ్మలక్ష్మీపురం సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో ఇటీవల నిర్వహించిన కంటి వైద్య శిబిరాల్లో 25 మంది అవ్వ, తాతలను శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్టు మన్యం జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్యాధికారి జీరు నగేష్‌రెడ్డి బుధవారం ఆయన తెలిపారు కాటరాక్ట్, టేరిజియం నేత్ర సమస్యలతో బాధపడుతున్న వారిని విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రికి శస్త్రచికిత్సల కోసం తరలించినట్టు పేర్కొన్నారు. కంటి వైద్య సహాయకులు శైలజ, రోజా, మల్లిక, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్య సేవలు

- డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు



బడ్డుమాసింగిలో వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌ఓ

పాలకొండ రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ బగాది జగన్నాథరావు అన్నారు. పాలకొండ మండలం ఎం.సింగుపురం పీహెచ్‌సీ పరిధిలో బడ్డుమాసింగి, తుమరాడ గ్రామాల్లో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ప్రజలతో మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో గ్రామీణులు రోగాల బారిన పడకుండా ప్రణాళికిబద్ధంగా వైద్యులు, సిబ్బంది వ్యవహరించాలన్నారు. ప్రజల్లో చైతన్యం వచ్చేలా అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అనంతరం అన్నవరం పీహెచ్‌సీని సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట వైద్యులు రవికుమార్, వి.కమల్‌నాథ్‌తో పాటు డీఈఎంఓ యోగేశ్వరరెడ్డి, హెచ్‌వీ హిమవతి, ఏఎన్ఎంలు టి.రామలక్ష్మి, అనూష, పెంటయ్య తదితరులున్నారు.

ఇళ్ల స్థలాల కోసం ఆందోళన



ఎల్విన్‌పేటలో సీపీఐ ఆధ్వర్యంలో గిరిజనుల నిరసన

గుమ్మలక్ష్మీపురం: నిరుపేద గిరిజనులైన తమకు మండల కేంద్రానికి సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని గుమ్మలక్ష్మీపురం మండలానికి చెందిన పలువురు గిరిజనులు డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్నతో కలిసి ఎల్విన్‌పేటలో బుధవారం వారు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా జీవన్న మాట్లాడుతూ ఎల్విన్‌పేటలోని గురుకుల బాలుర జూనియర్ కళాశాల సమీపంలో ఖాళీగా ఉన్న ప్రదేశంలో తమకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని గిరిజనులంతా తహసీల్దార్ నుంచి కలెక్టర్, ఫారెస్ట్ అధికారులను స్వతహాగా కలిసి విన్నవించుకున్నప్పటికీ, స్పందన లేదన్నారు. గిరిజనులకు న్యాయం చేకూర్చాలన్న డిమాండ్‌తో ఈ నెల 23 నుంచి తహసీల్దార్ కార్యాలయం ఎదుట మూడు రోజుల పాటు గిరిజనులతో కలిసి రిలే నిరసన దీక్షలు చేస్తామని తెలిపారు.